ఎన్నికల హామీలు నెరవేర్చాలి

తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడించిన దివ్యాంగులు

సాక్షినెట్‌వర్క్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరుతూ చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లోని మండలాల తహసీల్దార్ కార్యాలయాలను సోమవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగులు, నాయకులు ముట్టడించారు. రాష్ట్రంలోని 45 లక్షల మంది పింఛన్‌దారుల ఓట్లతో అధికారంలోకి వచ్చి నిర్లక్ష్యం ప్రదర్శించడం సరికాదని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళల పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం తహసీల్దార్లకు అందించారు. పెన్షన్‌దారుల సమస్యను పట్టించుకోని సీఎం తక్షణం పదవి నుంచి దిగిపోవాలని నినాదాలు చేశారు. సమస్య పరిష్కరించకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వికలాంగులకు రూ.6వేలు, వృద్ధులకు రూ. 4వేల పింఛన్ ఇవ్వాలని పేర్కొన్నారు.


తిమ్మాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు, దివ్యాంగుల నిరసన


చొప్పదండి తహసీల్దార్ కార్యాలయం ఎదుట..


జమ్మికుంట: వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి


సైదాపూర్: డిప్యూటీ తహసీల్దార్‌కు దివ్యాంగుల వినతి


రామడుగు తహసీల్దార్ రాజేశ్వరీకి నాయకుల వినతి


శంకరపట్నం డీటీకి ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి


మానకొండూర్‌రూరల్: డీటీ సమ్మయ్యకు దివ్యాంగుల వినతి


రామడుగు: ఉట్టి కొడుతున్న కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు

శ్రీకృష్ణాష్టమి వేడుకలు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైష్ణవ సాంప్రదాయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వేదపండితులు డింగరి కృష్ణామాచార్య, వేణుగోపాలచార్య ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ముక్కా జితేంద్రగుప్తా, కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


జమ్మికుంట: శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో..

రామడుగు: మండలంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శ్రీవైష్ణవ శ్రీకృష్ణాష్టమి వేడుకలను వేద పండితులు ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు.

మత్స్యగిరీంద్రస్వామి గుట్టపై

శంకరపట్నం: కొత్తగట్టు మత్స్యగిరంద్రస్వామి గుట్టపై వైష్ణవ శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు శేషం మురళీధరాచార్యుడు, ధర్మకర్త లక్ష్మణ్‌రావు, మాజీ సర్పంచ్ కిషన్‌రావు, భక్తులు పాల్గొన్నారు.


కొత్తగట్టు మత్స్యగిరంద్రస్వామి గుట్టపై

హనుమాన్ ఆలయంలో రామకోటి ప్రారంభం

చొప్పదండి: పట్టణంలోని పాత హనుమాన్ ఆలయంలో సోమవారం మహిళా భక్తులు రామకోటి రాయడం ప్రారంభించారు. హనుమాన్ భజన మండలి సభ్యుడు చీకట్ల లచ్చయ్య ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన జ్ఞాన సరస్వతి సేవాదళ్ సభ్యులు 41 బుక్కుల్లో రాయడం మొదలుపెట్టారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కరీంనగర్ నీలకంఠ భజన మండలి ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు సంప్రదించాలని చీకట్ల లచ్చయ్య కోరారు.


చొప్పదండి: రామకోటి సంకల్పం ప్రారంభిస్తున్న మహిళా భక్తులు

క్లుప్తంగా

టీఎల్ఎం మేళా



మానకొండూర్: మండల వనరుల కేంద్రంలో సోమవారం మండల స్థాయి టీఎల్ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) మేళా నిర్వహించారు. ప్రతీ పాఠశాల నుంచి ఉపాధ్యాయులు బోధనోపకరణాలను తయారుచేసి మేళాలో ప్రదర్శించారు. మండల విద్యాశాఖ అధికారి మధుసూదనాచారి మేళాను ప్రారంభించి మాట్లాడారు. బోధనోపకరణాలతో విద్యార్థులకు బోధన సులభతరం అవుతుందని గుర్తు చేశారు. మండల స్థాయిలో ఉత్తమ బోధనోపకరణాలను తదుపరి జరగబోయే జిల్లా స్థాయి మేళాకు పంపించడం జరుగుతుందన్నారు. వివిధ పాఠశాలల బోధనోపకరణాలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి డి. శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఘనంగా ఇంజినీర్స్ డే


అధ్యాపకులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని సోమవారం ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.ఆంజనేయరావు మోక్షంగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన చేసిన పనులను గుర్తు చేసుకున్నారు. ఈసందర్భంగా పలువురు అధ్యాపకులను సన్మానించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో జయన్న ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సరిత జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ శంకర ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 250 మందికి పైగా ప్రజలు హాజరు కాగా వైద్యులు కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

జమ్మికుంట: పట్టణంలోని యూనియన్ బ్యాంక్ కస్టమర్ సర్వీస్ పాయింట్‌ను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ దొరస్వామి నాయక్ అన్నారు. సోమవారం సర్వీస్ పాయింట్‌ను ప్రారంభించి మాట్లాడారు. కస్టమర్ సర్వీస్‌తో ఖాతాదారుల సందేహాలు, బ్యాంక్ పనులు సులభతరం అవుతాయన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ప్రతినిధి సమ్మెట అచ్యుత్, ఏరియా మేనేజర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

రామడుగు: మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న 26 మంది ఉత్తమ ఉపాధ్యాయులను రామడుగు రైతువేదికలో సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సన్మానించారు. దేశ భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని, ఉపాధ్యాయులను సన్మానించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరీ, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల, సింగిల్ విండో చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి, ఎస్సై రాజు, ఎంఈవో రంగనాథశర్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో అధికారులు కనీస ప్రమాణాలు పాటించలేదని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సూచనలు ఏమాత్రం పట్టించుకోకుండా కొందరు ఉపాధ్యాయులు సూచించిన వారిని మాత్రమే ఎంపిక చేసి సన్మానం చేశారని, ఉపాధ్యాయ వృత్తిలో కష్టపడి పనిచేస్తున్నప్పటికీ గుర్తింపు లేకుండా పోయిందని వాపోయారు.


ఉత్తమ ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే సత్యం

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

చొప్పదండి: పట్టణంలోని ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే సోమవారం రాత్రి ప్రారంభించారు. ఎమ్మెల్యే నిధులతో పట్టణ ప్రజలకు లైటింగ్ అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మునిగాల చందు గౌడ్, పెరుమాండ్ల గంగయ్య గౌడ్, మునిగాల సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

చొప్పదండి: పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని, రికార్డుల నిర్వహణలో శ్రద్ధ వహించాలని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సూచించారు. చొప్పదండిలోని సీఐ కార్యాలయాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అండర్ ట్రయల్ కేసుల రికార్డులు, కమిషనరేట్ కంప్లెయింట్ సెల్ ద్వారా అందిన ఫిర్యాదుల రిజిష్టర్, నెలవారి క్రైమ్ రిపోర్టు రిజిష్టర్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హిందీభాషా దినోత్సవం

చొప్పదండి: భాష నేర్చుకోవడానికి జిజ్ఞాస ఉండాలని, హిందీ భాష భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని ఎంఈవో మోహన్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ హిందీభాషా దినోత్సవం నిర్వహించగా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన గ్యాలరీని పరిశీలించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, హెచ్ఎం వైద్యుల రాజిరెడ్డి, జూనియర్ కళాశాల లెక్చరర్ కనకయ్య, జలీల్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాట్లు పరిశీలన

శంకరపట్నం: ప్రజలకు ఇబ్బందులు కలగకుండా దుర్గామాత విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని కేశవపట్నం ఎస్సై శేఖర్‌రెడ్డి సూచించారు. ప్రధానరోడ్లపై విగ్రహాలు ఏర్పాటు చేస్తే రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో దుర్గామాత విగ్రహాల ఏర్పాట్లను పరిశీలించారు.

చెక్కుల పంపిణీ

వీణవంక: మామిడాలపల్లి గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండలంలోని కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. సీనియర్ నాయకుడు చింతల శ్యాంసుందర్‌రెడ్డి చొరవతో ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్‌కు విన్నవించగానే వెంటనే చెక్కుల మంజూరుకు కృషి చేశారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తాళ్లపెల్లి తిరుపతి, గుండేటి మహేశ్, దాసారపు వెంకటేశ్ తదితరులున్నారు.

ఎల్ఎండీ రెండు గేట్లు ఎత్తివేత

తిమ్మాపూర్: లోయర్ మానేరు జలాశయం రెండు గేట్లను సోమవారం రాత్రి 9 గంటలకు అధికారులు ఎత్తేశారు. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు రెండు గేట్లనెత్తి 4 వేల క్యూసెక్కుల నీటిని మానేరులోకి వదులుతున్నారు.

తెలంగాణలో పోలీసు రాజ్యం


శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న సుంకె రవిశంకర్

కరీంనగర్: ప్రజాస్వామ్యంలో ప్రశ్నిస్తే పోలీసు కేసులు పెట్టడం, భయభ్రాంతులకు గురి చేయడం రివాజుగా మారిందని, రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తుందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన బండారి శ్రీనివాస్‌ను పరామర్శించిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఎన్నికల సమయంలో హిమ్మత్‌నగర్‌కి బస్సు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చి రెండేళ్లు గడిచిన హామీని శ్రీనివాస్ సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే ఆ యువకుడిని మల్యాల ఎస్ఐ నరేశ్ అరెస్టు చేయించి చిత్రహింసలకు గురి చేసి అక్రమ కేసులు పెట్టించడం ఎమ్మెల్యే సత్యంకే చెల్లిందని మండిపడ్డారు. కొంత మంది పోలీసులు కాంగ్రెస్ నాయకుల్లాగా వ్యవహరిస్తున్నారని తీరు మార్చుకోవాలని హితవు పలికారు.

ఇసుక డంపు సీజ్

తిమ్మాపూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఇసుక డంపుపై రెవెన్యూ అధికారులు సోమవారం దాడులు చేశారు. గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 80 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను ఎస్సై శ్రీకాంత్ గౌడ్ సీజ్ చేసి తిమ్మాపూర్ తహసీల్దార్‌కు అప్పగించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ పరిధిలోని 15 ఇసుక ట్రాక్టర్ల యజమానులకు మేజిస్ట్రేట్ భానోత్ రాజేశ్వర్ రూ.8 వేల చొప్పున జరిమానా విధించారని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. జరిమానాతోపాటు 15 మందితో ఒక రోజు గవర్నమెంట్ ఆఫీసుల్లో స్వచ్ఛభారత్ చేయించాలని ఆదేశించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గన్నేరువరం: మండలంలోని కేజీబీవీలో అటెండర్, స్వీపర్, వాచ్‌మెన్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మండల విద్యాధికారి రామయ్య సోమవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై మండలాని చెందిన మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అర్హులు 18వ తేదీ సాయంత్రం నాలుగు గంటలలోపు మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

గడువు పొడిగింపు

జమ్మికుంట: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం దూరవిద్యలో బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. బి.రమేశ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబర్ 26 తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలని, దివ్యాంగులకు, గిరిజనులు, ట్రాన్స్‌జెండర్స్‌కు ఉచిత విద్య అందించనున్నామని వివరాలకు 7382929775 నంబర్ సంప్రదించాలన్నారు.

డీట్ యాప్‌పై అవగాహన


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టాస్క్(తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జి సెంటర్) విభాగం ఆధ్వర్యంలో డీఈఈటీ(డిజిటల్ ఎప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ) యాప్‌పై ప్రిన్సిపల్ డా.రమేశ్ సోమవారం అవగాహన కల్పించారు. విద్యార్థులు డిట్ యాప్‌లో వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవడం వల్ల ఉద్యోగ అవకాశాలకు కావాల్సిన నైపుణ్యాలు గూర్చి తెలుస్తుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఓదెలుకుమార్, ఉమాకిరణ్, రాజేంద్రం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్రపర్యటన

వీణవంక: మల్లారెడ్డి విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ విద్యార్థులు సోమవారం మండల కేంద్రంలో క్షేత్ర పర్యటన నిర్వహించారు. వ్యవసాయ విద్యార్థుల గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతులు ఏ పంటలు సాగుచేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రీతి, శోభ, నికిత, ప్రసీద, ప్రియాంక, నందిత, ప్రణతి, లావణ్య, మనీషా రైతులు పాల్గొన్నారు.

రాజాపల్లిలో కొండచిలువ హల్‌చల్



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాజాపల్లి గ్రామ శివారులోని గుట్ట నుంచి ఓ కొండచిలువ సోమవారం తెల్లవారుజామున జమ్మికుంట– హుజూరాబాద్ ప్రధాన రోడ్డుపై సంచరించడంతో గ్రామస్తులు భయందోళనకు గురయ్యారు. ఆరు అడుగుల కొండచిలువ కనిపించడంతో ప్రయాణికులు, గ్రామస్తులు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. సుమారు రెండు గంటల పాటు శ్రమించి చాకచక్యంగా పట్టుకుని సురక్షిత ప్రాంతానికి తరలించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ముందుచూపులేకనే యూరియా కొరత

మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్: కాంగ్రెస్, బీజేపీ పార్టీల కు ముందుచూపులేకనే యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మానకొండూర్‌లోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. రైతుల కన్నీళ్లు చూడలేకపోతున్నానని, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కనీసం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు క్యూలో లేకున్నా యూరియా బస్తాలు ఎలా దొరుకుతున్నాయని, సహకార సంఘాల్లో ఎమ్మెల్యే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో ఎరువుల కొరత ఏర్పడలేదని, యూరియా బస్తాలు ఇప్పించిన సహకార డైరెక్టర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టడం కక్ష సాధింపు చర్య అని, రైతులకు సరిపడా యూరియా అందించని పక్షంలో రైతుల పక్షాన పోరాడుతామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ రామంచ గోపాల్‌రెడ్డి, నాయకులు శాతరాజు యాదగిరి, వెంకటస్వామి, రాజశేఖర్, రాజేందర్, రాయికంటి కిరణ్, చంద్రమౌళి, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న అనంతరెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరుగనున్న 69వ జిల్లా స్థాయి పాఠశాలల క్రీడా పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన అండర్ 14, 17 బాలబాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో రాణించి జిల్లాస్థాయికి ఎంపికయ్యారని అన్నారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో జాతీయస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. విద్యార్థులను విద్యాసంస్థల ప్రిన్సిపాల్ సరితారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శైలజారెడ్డి, పీఈటీలు మహేందర్, తిరుపతి, స్వామి, జహీదలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు అభినందించారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

కొత్తపల్లి: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 69వ జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలను సోమవారం కొత్తపల్లి శివారులోని ఢిల్లీ డిఫెన్స్ అకాడమీలో ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి గంగాధర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రీడలు మానసికోల్లాసానికి ఉపయోగపడటమే కాకుండా స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. గెలుపు ఓటములు సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ, జూనియర్ కళాశాల చైర్మన్ కొత్త సతీశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కొట్టె చంద్రశేఖర్, జిల్లా యువజన క్రీడాధికారి శ్రీనివాస్‌గౌడ్, ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి జి.జనార్దన్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ఐ జిల్లా సెక్రెటరీ వేణుగోపాల్, గిన్నె లక్ష్మణ్, ఎ.శంకరయ్య, శ్రీనివాస్, వివిధ పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న గంగాధర్

ఆర్థికసాయం

తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కొలిపాక రాజమౌళి తండ్రి మల్లయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.ఐదువేల ఆర్థికసాయం చేశారు. వెంట మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్, గుర్రం జగదీష్, నార్ల అశోక్, బీనపల్లి బాలయ్య, కొలిపాక రాజయ్య తదితరులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న రావుల రమేశ్, పొన్నం అనిల్